మనసునందు మంచి మాటలందును మంచి
నడతలందు మంచి పాడమకున్న
సాయి మిమ్ము మెచ్చి సంతోషమెటులిచ్చు
శాంతి ప్రేమదాయి సత్యసాయి.

మాటలందు తీపి మనసులో చేదుంచ
మంచికాదు మీకు మచ్చగాని
మచ్చతోని బ్రతుకె మహిలోన చెల్లరా
విద్యలందు ముఖ్యవిలువ యిదియె.

విద్యార్థులారా! నిత్యజీవితములో నిత్యమైన సత్యాన్ని గుర్తించవలెనన్న మానవునకు ప్రత్యక్ష ప్రమాణములు శరీరము, ఇంద్రియము, మనస్సు, బుద్ధి. వీని రహస్యమును గుర్తించుకున్నప్పుడే వాటిని యేవిధముగా వుపయోగించుకోవాలనే సత్యము మనకు అర్థమవుతుంది. కాని జగత్తులో లాంభై తొమ్మిది వంతుల మంది వీటి రహస్యమును గుర్తించక వర్తించటము చేతనే అనేక దుఃఖములకు, విచారములకు, కష్టములకు గురి అగుచున్నారు. ఈ దేహము, ఇంద్రియము, మనస్సు, బుద్ధి జీవునకు వుపాధులే గాని ఇవి చైతన్యవంతమైనవి కాదు.

దేహము కేవలము జడము. ఇది రక్తపు ముద్దగా మారి, బాల్యమునందు కోమలముగా రూపొంది, యవ్వనమునందు సౌందర్యమును అనుభవించి, వృద్ధాప్యమునందు వికారమును పొందుతుంది. ఈ మార్పును పురస్కరించుకొని మానవుడు దేహమును చైతన్యవంతమైనదని, దేహము జడముకాదని భావిస్తున్నాడు. అయితే యీ మార్పునకు దేహముకాదు కారణము, దేహము జడము మాత్రమే. దీనికి చక్కని ఉదాహరణము. నిత్యము మనము గృహమును వూడ్చి ఆ చెత్తను ఒక గుంతలో వేస్తూవుంటాము. ఈ విధముగా కొన్ని మాసములు వేసినప్పుడు అది పెద్ద దిబ్బగా తయారౌతుంది. ఇది పెద్ద దిబ్బగా వుండినంత మాత్రమున దీనికి చైతన్యమున్నదని అర్థము. కాదు కాదు. దేహము కూడా అటువంటిదే. మనము ఇడ్లీ దోసె మొదలగు వానిని మనదేహమునకు వేసినప్పుడు అది దిబ్బవలె పెరుగుతుంది. కొంతకాలము దీనికి ఆహారము వేయకుండా చూడు. ఈ దేహము పెరుగదు. అది క్షీణిస్తుంది కనుక

పొట్టచూడ మలమూత్రముల గుంత
దేహము చూడ కంపుగొట్టె దిబ్బ
ఆత్మకు యిదియే అద్దె కొంప

కనుకనే వేదాంతమునందు దేహోదేవాలయ ప్రోక్తో జీవోదేవస్సనాతనః. ఇది కేవలము ఒక
rented house. అయితే యీ యింద్రియములు, మనస్సు, బుద్ధి యిత్యాది వ్యాధులు ఏవి
ఏ విధమైన రీతిలో వృద్ధిఅంచుచున్నవి, క్షీణింప చేయుచున్నవి అన్నవిషయమును విచారించ
వలసి వుంటుంది. ప్రపంచమంతా పంచభూతములస్వరూపము. అవియే శబ్ద, స్పర్శ, రూపరస
గంధములు. వీనినే ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అన్నారు. ఇవి అన్నీకూడా సత్ చిత్
ఆనందములనుండియే ఆవిర్భవించినవి. వీనియొక్క స్వస్థానము సచ్చిదానందమే.

ఈ ఆకాశమన్నది ఒకపెద్దపాత్ర. ఇందులోనే మిగిలిన నాలుగు భూతములు
అనగా అగ్ని, గాలి, జలము, పృథ్వి యిందులోనే యిమిడివున్నాయి. ఇవి ఒకదానికంటె ఒకటి
సూక్ష్మమై వుంటాయి. పృథ్వికంటె జలము సూక్ష్మమై అతి విశాలముగా వుంటుంది. అందువల
న అది పృథ్వికంటె తేలికగా వుంటుంది. జలముకంటె అగ్నిమరింత సూక్ష్మమైన స్వరూ
పమును ధరిస్తుంది. అగ్నికంటె గాలి మరింత సూక్ష్మరూపము ధరిస్తుంది. ఇది మరింత వ్యా
పించి వుంటుంది. ఈ గాలికంటె ఆకాశము మరింత సూక్ష్మమై వుంటుంది. కనుకనే యీ పంచ
భూతములైన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి వీటిని పంచకోశములు ఆవరించి
వుంటున్నవి. వీనిలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అంతర్లీనమై వుంటుంటాయి.

ఆకాశములోపల అతిగతి అనేది ప్రారంభమవుతుంది. ఇది చలనము
కలిగి వుంటుంది. ఈ చలనమన్నది గాలిగా రూపొంది దీనినుండి వేడి ప్రారంభమవుతుంది.
కదలికచేత వేడిప్రారంభమవటము వైజ్ఞానికముగా కూడా తెలిసినదే. చేతులను ఒకదానితో
ఒకటి గట్టిగా రాపిడి చేస్తే దానిలో వేడి ప్రారంభమవుతుంది. గాలివలనే ఉష్ణము వృద్ధిని
స్తుంది. ఉష్ణము అభివృద్ధికావాలంటే గాలి అత్యవసరము. ఈ ఉష్ణము చల్లబడినప్పుడు అదే
నీరుగా మారుతుంది. ఆనీరు ఘనీభవించినప్పుడు అది పృథ్విగా రూపొందుతుంది. కనుక
యీ పంచభూతములకు మూలాధారమైనదే ఆకాశము. ఇవి కేవలము లోకోద్ధారనిమిత్త
మే ఏర్పడినవే కాక సర్వజ్ఞత్వమైన దైవత్వమును నిరూపించుటములో యిది ప్రమాణము
గా వుంటున్నవి. యింక మనో బుద్ధి చిత్త అహంకారములు. అహంకారము ప్రాణములో కూడివు
ంటుంది. దీనికి విజ్ఞానమయ కోశము నిలయము. మనస్సు చిత్తముతో చేరివుంటుంది. ఇది
మనోమయ కోశము. ఏతావాతా జీవునకు ప్రాణికి మధ్యమనస్సు చేరి వుంటుంది. మనస్సు
నకు, దేహమునకు మధ్య ప్రాణము చేరివుంటుంది. ఏతావాతా దీనిని నిర్ణయించు కోవాలన్నప్పు
డు మనస్సుకు పైన బుద్ధి చేరి వుంటుంది. ప్రాణము క్రిందన వుంటుంది. ఈ బుద్ధి, ప్రాణము
అగ్నిమయము. ఈ రెండు అగ్నిమయమైన రూపములు దేహమున చేరి వుండటము చేతనే
దేహము యొక్క ఉష్ణస్థితి కాపాడుతున్నది.

ఈ మనస్సును మనము అల్పమైనదిగా, స్వల్పమైనదిగా భావించరాదు.
మనస్సే యీ ప్రపంచము. మనస్సే యీ మనిషి. కనుక మనస్సును మనము అతిజాగ్రత్తగా
సత్రించటానికి ప్రయత్నించాలి. పైన బుద్ధి క్రింద ప్రాణము. ఈ రెండు అగ్నిమయము.

తాపటవముచేత మధ్యనున్న మనస్సు కరిగిపోతుంటుంది. మనస్సునకు అధిష్ఠానదేవత చంద్రుడు.
చంద్రుడు చల్లదనము. కనుకనే జలము చల్లగా వుండి కరిగే నీరుగా వుంటుంది. నీరు ఎక్కడ
పోసినాగాని క్రిందికే దిగుతుందిగాని పైకి పోదు. అగ్ని ఎక్కడ పెట్టినా గాని పైకే వస్తుందిగాని
క్రిందికి పోదు. మనస్సు మనిషిలో వుండటము చేత విషయసంబంధమైన Low level నందే
దిగజారిపోతుంది. అట్టి అధోగతికి దిగజారే మనస్సును ఊర్ధ్వగతికి ప్రయాణము చేయునట్లు
ట్లు మనము చూడాలి. అయితే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, పంచభూతములు
ఇవన్నీ ఎక్కడనుండి పుట్టాయి? అన్నీ సచ్చిదానందమనే మూలస్థానమునుండే ఆవిర్భవించా
యి. ఎట్లనగా ప్రజ్వరిల్లుచుండిన అగ్నిగుండమునుండి అనేక అగ్నికణములు బయలుదే
రుతున్నవి. అదేవిధముగనే యీ పంచభూతములు ఒకే సచ్చిదానందమునుండి అణురూప
ములుగా బయలుదేరుతున్నాయి. ప్రతిజీవి కూడ తన జన్మస్థానము గూర్చి విచారించిన దాని
కి సచ్చిదానందమే తన జన్మస్థానముగా నిరూపణ అవుతుంది. దీనికి ఉదాహరణ. దేహమును
ధరించి, యింద్రియములను వరించి, మనస్సును భ్రమించి చిత్తములో మునగటము చేతనే
మన యదార్థస్థానమును విస్మరిస్తున్నాము.

ఈ దేహమునకు మూలకారణము ఏమిటి? దీనికి మొట్టమొదటిస్థానము
అజ్ఞానమే. అజ్ఞానమునుండే అవివేకము ప్రారంభమవుతుంది. అవివేకమునుండే అహంకారము
వస్తుంది. అహంకారమునుండే ద్వేషము ప్రారంభమవుతుంది. ఈ ద్వేషమునుండే రాగము ప్ర
వేశిస్తుంది. రాగము చేతనే కర్మలాచరిస్తున్నారు. కర్మాచరణము వలనే దేహము లభిస్తున్న
ది. కనుక యీదేహమునకు మూలకారణము అజ్ఞానమే. అజ్ఞానమనగా ఏమిటి? సత్యమును అస
త్యముగా, అసత్యమును సత్యముగా భావించటమే అజ్ఞానము. మీకందరికి తెలుసు. మహాభా
రతమునందు పాండవాగ్రజుడైన ధర్మజుడు అతి ఉత్తమ స్వరూపుడని గుర్తించి మయాసురు
డు అతనికి రాజసూయ యాగ సమయమున అతనికి పెద్ద భవనము నిర్మించాడు. దానినే
మయసభ అన్నారు. ఈ మయసభయొక్క చిత్రము, విచిత్రము యేమంటే నీరు వుండినప్పు
డు నీరు లేనట్లుగా, నీరులేని ప్రదేశములో నీరు వుండినట్లుగా కనబడుతుంది. ఎక్కడ
ద్వారము లేదో అక్కడ ద్వారము వుండినట్లుగా కనబడుతుంది. ద్వారము వుండినప్పుడు
ద్వారము లేనట్లుగా కనబడుతుంది. వున్నది లేనట్లు, లేనిది వున్నట్లు కనుపించటమే
యీ మయసభ మహత్తు. ఈ చిత్రమైన మందిరము దర్శించే నిమిత్తమై దుర్యోధన, దుశ్శాసను
లు అందులోనికి ప్రవేశించారు. వారికి ఒక కొలను కనబడింది. జలము వున్నది కదా అని వా
రు వస్త్రములను పైకెత్తి ప్రవేశించారు. కాని అందులో జలము లేదు. కొంచెము దూరము
పోయేసరికి జలము వుండినా లేనట్లుగా కనుపించింది. చాలా వేగముగా, అహంకారముగా
పోతూ ఆగుంటలో పడ్డారు. ఇక్కడ యీ మయసభ ఏమిటి?

ఈ విశ్వమే ఒక పెద్ద మయసభ. ఈ దుర్యోధన దుశ్శాసనులే మన రాగ
ద్వేషములు. దుశ్శాసన మనగా శాసనములను వుల్లంఘించే వాడు. అతనికి శాసనమే

లేదు. అతను శాసనములు లేకుండా ప్రవర్తించటము వలననే యిన్ని అవమానములు సంభవించాయి. తనశక్తి సామర్థ్యములను దుర్వినియోగము చేసినవాడే దుర్యోధనుడు. ప్రతిమానవుడు కూడా దుర్యోధన దుశ్శాసనులే. మనకు జీవితములో కొన్ని నిబంధనలు వుంటున్నాయి. వానిని మనము అనుసరించినప్పుడే సరైన శాంతి భద్రతలను పొందుతాము. మన ఇన్‌స్టిట్యూట్ లో రూల్సు అండ్ రెగ్యులేషన్సు ఏమిటి? మన హాస్టలు రూల్సు అండ్ రెగ్యులేషన్సు ఏమిటి? వీటిని చక్కగా గుర్తించి వర్తించినప్పుడే మనము విద్యార్థులమవుతాము. మన శక్తి సామర్థ్యములను మనము దుర్వినియోగము చేయటానికి పూనుకున్నప్పుడు మనము అబలులమై పోతాము. దుర్మార్గులుగా మారిపోతాము.

మనము ఏమిటి దుర్వినియోగము చేస్తున్నాము? మన చూపులను దుర్వినియోగము చేస్తున్నాము. మన నాలుకను దుర్వినియోగము చేస్తున్నాము. మన శ్రవణమును దుర్వినియోగము చేస్తున్నాము. మన హృదయమును దుర్వినియోగము చేస్తున్నాము. మన హస్తమును దుర్వినియోగము చేస్తున్నాము. ఈ misuse అంటే ఏమిటి? మానవుని యందున్న దివ్యశక్తిని అనగా energyని దుర్వినియోగము చేయటమే misuse. మనము శ్రవణము చేతను, ఒడలు చేతను మనము దుర్వినియోగము చేస్తున్నాము. ఈ విధముగా దుర్వినియోగము చేయటము వలన దుర్యోధనులవుతున్నారు. ఈ దుర్యోధన దుశ్శాసనులకు కలిగిన ఫలితమేమిటి? పరాభవమే! అపజయమే! దుఃఖమే. వారికి ప్రాప్తించింది. కనుక మనము యీ జగత్తునందు ఏ శక్తిని కూడా దుర్వినియోగము చేయకూడదు. ఈ విధముగా దుర్వినియోగము చేయటము వలన దైవ శక్తిని దుర్వినియోగము చేసిన వారమవుతున్నాము. సముద్రము వుంటున్నది. ఈ సముద్రములో అనేక అలలు ప్రారంభమవుతూ వుంటాయి. ఈ అలలో నురుగు వృద్ధివిస్తుంది. ఈ నురుగు అలలలో కూడుకొని వుంటుంది. అలలు సముద్రములో కూడుకొని వుంటుంది. ఈ మూడు ఒకదానికొకటి ప్రత్యేకమైనవి కాదు. అదేవిధముగనే మానవుని యందు సత్వరజ తమోగుణములు వృద్ధివిస్తున్నవి. యీ అన్నింటికిని ఆత్మయే ప్రధానమైన మూలస్థానము. ఈ ఆత్మ ఎక్కడ వున్నది? దేనిని ఆత్మయని మనము విశ్వసించాలి? ఈ సందేహము ప్రతి మానవునికి కలగటం సహజము. దీనికి చక్కని ప్రమాణము.

ఈనాడు ఆదివారము. అక్టోబరు రెండవ తేదీ అని మనము అంటున్నాము. ఎవరు చెప్పారు. నేను అక్టోబరు రెండవ తేదీ అని యేమైనా బోర్డు వ్రాసుకొని వస్తున్నానా? చెబితే ఎవరో సిద్ధాంతి వ్రాసిన కేలండరునో పంచాంగమునో ఆధారము చేసుకొని మనము దానిని అనుసరిస్తున్నాము. దానిని ఆధారము చేసుకొని మనము జీవితాన్ని గడుపుతున్నాము. ఇదంతా ఆధారము కాదని మనము విసర్జించటానికి వీలుకాదు. అదేవిధముగనే వేదము శాస్త్రము ఇది బ్రహ్మ యిది ఆత్మ అని ప్రజలకు బోధిస్తూ వస్తున్నాయి. మాసమునకు, తేదీకి మనము కేలండరును ఎంతగా విశ్వసిస్తున్నామో మనము బ్రహ్మకు, ఆత్మకు వేద

102108805

మను శాస్త్రమును అంతగా విశ్వసించాలి. మనము నిత్యజీవితములో అనుభవించే ప్రతి ఒక్కటి కూడా వేదప్రమాణమును బట్టి అనుసరిస్తున్నాము. జంతూనాం నర జన్మ దుర్లభమ్ అన్నది శృతి. జన అనగా జన్మించినటువంటిది. పులి, ఏనుగు, కుక్క, నక్క యివన్నీ జన్మించినటువంటివే. ఒక్కొక్కదానికి ఒక్కొక్క పేరు పెడుతూ వచ్చారు. అదే విధముగా యీ జన్మించిన యీ దేహమునకు కూడా మనిషి అని పేరు పెట్టారు. కుక్క, నక్క అని పేరు పెట్టినట్లుగానే యీ మానవ దేహమునకు మనిషి అని పేరుపెట్టారు. మానవునకు వివేకము పెరిగి జ్ఞానము నశించటము వలనే వేదమును విశ్వసించటంలేదు. ఆత్మ వున్నదనే సత్యము మాకు అక్కరలేదు అంటారు. ఆ వేదమే జంతూనాం నరజన్మ దుర్లభమ్ అని చెప్పి మానవుడు ప్రత్యేకమైన వాడు అని అన్నది. శృతి చెప్పినట్లుగా దేవుడు కలడన్న వాక్యమును విశ్వసించని మానవుడు 'నేను మనిషిని' అన్న వాక్యమును ఎందుకు విశ్వసించాలి. తాను మనిషో కాదో తనకేమి తెలుసు. తాను మనిషో కుక్కో తనకేమి తెలుసు. నీకు అవసరమైన పదములను వేదమునుండి తీసుకొని నేను మనిషి అంటున్నావు. దైవము వున్నాడనే విషయము కూడా ఎందుకు అంగీకరించ కూడదు.

మానవుని భ్రమలే మానవుని సందేహములకు, అపోహలకు కారణము. వైజ్ఞానికముగా కొన్ని ప్రమాణము లున్నవి. మృత్తికతో చేసిన అద్దము మనముందు పెట్టుకొన్నప్పుడు ఆ mirror లో మన ప్రతిబింబము మనకు కనబడుతుంది. అయితే యీ ప్రతిబింబమే అద్దములో వున్నదా లేదు. లేదు. ఈ అద్దమునకు వెనుక పూసిన రసాయన ప్రభావము వలన మన దృష్టి దానిపై పడి అది మన ప్రతిబింబమును చూపుతున్నది. అది నీడ మాత్రమే. మన ప్రతిబింబము దానిలో లేదు. బింబమును చూచి అదియే సత్యమని భావిస్తున్నాము. ఇది సత్యము కాదు. ఇది విరుద్ధమైనది. ఎట్లనగా అద్దములో నీ ప్రతిబింబమును చూచినప్పుడు right eye left eye గా కనబడుతుంది. అది సత్యమని ఎట్లు చెప్పటానికి వీలవుతుంది. ఉన్నదానికి విరుద్ధముగా నిరూపిస్తున్నది. అదే విధముగనే ఈ ప్రకృతి ఒక పెద్ద అద్దము. కానీ అందులో కనుపించే విరుద్ధమైన స్వరూపాలను సత్యముగా భావిస్తున్నాము. అన్నీ భగవంతుని స్వరూపాలే. ఒకే భగవంతుడు అనేక రూపాలు ధరించాడు. అన్ని మతములు దీనినే అంగీకరిస్తున్నవి. బైబిలునందు God created man in His own image అని వున్నది. వేదమునందు కూడా ఏకోహం బహుస్యాం అన్ని రూపములు నావే అని బోధిస్తూ వచ్చాడు. సర్వము భగవత్ స్వరూపమని భావించు వ్యక్తులు భగవంతుని విస్మరించి, కేవలము ప్రపంచాన్ని విస్మరించి ప్రపంచానికి విరుద్ధమైన జీవితాన్ని గడుపుతున్నారు. మన యింద్రియములు వాటికి అవే పని చేస్తున్నాయని అనుకొంటున్నాము. విద్యార్థులారా! మనసే అన్నింటికి మూలకారణము.

మనసు యొక్క తత్వాన్ని మనము గుర్తించుకుంటే మహత్తరమైన తత్త్వమునలో ప్రారంభమవుతుంది. నేత్రము మనకు ఒక యింద్రియముగా కనబడుతున్నది. నోరు ఒక యింద్రియముగా మనకు గోచరించుచున్నది. చెవి ఒక యింద్రియముగా కను

102108806

పిస్తున్నది. జాగ్రదవస్థలో కన్నులు చూస్తున్నాయి. నోరు మాట్లాడుతుంది. ముక్కు వాసన చూస్తుంది. స్వప్నావస్థలో నేత్రముగాని, శ్రోత్రముగాని, ముక్కుగాని ఏవీ యిందులో కదలటంలేదు. అయితే స్వప్నములో చూస్తున్నది ఏ నేత్రము? భయ భ్రాంతులతో కూడిన శబ్దములను వింటున్నాము. ఆ శబ్దాలను యెవరు వింటున్నారు? స్వప్నములో అనేకరీతులుగా మాట్లాడుతున్నాము. ఏ జిహ్వ మాట్లాడుతున్నది? కాదు. కాదు. ఈ అన్ని స్వరూపములను ధరించేది మనసే. స్వప్నావస్థలోపల మన నేత్రమవుతుంది. మనసే జిహ్వ అవుతుంది. మనసే అన్ని ఆకారములను ధరిస్తుంటాది. ఇంద్రియములు స్వప్నావస్థలో పని చేయటంలేదు. నీ పాదములు మెట్లపై పడివున్నాయి. నీవు అరణ్యములో ఎక్కడో నడుస్తున్నావు. ఆ పాదములు ఎవరివి? నీ పాదములు స్వప్నములో నడవటము లేదు. అక్కడ మనస్సే సర్వ స్వరూపములను ధరిస్తున్నది. కనుకనే మనోమూలమిదం జగత్ అని అన్నారు. జగత్తంతా మనస్సుయొక్క స్వరూపమే. ఈ మనస్సును సక్రమమైన మార్గములో పెట్టినప్పుడు సర్వేంద్రియములు సులభముగా వశమైపోతాయి. కనుకనే మనస్సును మనము వశము చేసుకుంటే సర్వేంద్రియములు మనకు వశమవుతాయి. చెట్ల వేళ్ళకు మనము నీరు పోస్తే కొమ్మలకు, ఆకులకు అన్నింటికి ఆ నీరు చేరుతుంది.

మనస్సు అంటే ఏమిటి? ఇది కూడా భ్రాంతియే. ఈ భ్రాంతి మన కర్మల ద్వారా ప్రారంభమవుతుంది. మనము ఒక త్రాడును చూచాము. కొంత చిమ్మచీకటి క్రమ్మినప్పుడు అది పామేమోనని భయపడతావు. అయితే యీ భ్రమకు, యీ భయమునకు కారణమేమిటి? పూర్వము నీవు పామును త్రాడును రెండింటినీ చూచావు. అందువలనే నీకు యీ భయమేర్పడుతున్నది. ఈ త్రాడు పాములాగ కనబడుతున్నది కనుక యిది పామే నన్న భ్రాంతి ఏర్పడుతుంది. ఇది పాము అన్న భ్రాంతి వచ్చినప్పుడు తక్షణమే భయమేర్పడుతుంది. భయము వచ్చినప్పటికీ దూరమైపోతున్నావు. టార్చిలైటు వేశావు. వేసిన వెంటనే యిది పాము కాదు అని తెలిసింది. అది త్రాడని తెలుసుకున్నావు. దానిని పారవేశావు. నీవు పాముని భ్రమించినప్పుడు పాము అక్కడికి రాలేదు, అక్కడ నుండి పోలేదు, లైట్ వేసిన తరువాత పాము పోలేదు, త్రాడు రాలేదు. అప్పుడు యిప్పుడు వున్నది త్రాడు ఒక్కటే. రావటము పోవటము యీ భ్రమనే. ఈ భ్రమ వుండినంతవరకు బ్రహ్మ అర్థము కాదు. భ్రమను మనము వదలాలి. దానిని వదలాలి అంటే ఏమి కావాలి? మనకు విశ్వాసము కావాలి. పరబ్రహ్మము లేక పదార్థము వుండుటకు వీలుకాదు. ఒక చిన్న ఉదాహరణము. కొడుకులు లేని తల్లితండ్రులు లోకములో వుండవచ్చునుగాని తండ్రులు లేని కొడుకులు వుండరు. చేపలు లేని జలము వుండవచ్చునుగాని జలములేని చేపలు వుండుటకు వీలుకాదు. ప్రతి దానికి మూలాధారమైన పదార్థము లేక ప్రాకృతమైన పదార్థము వుండుటకు వీలుకాదు. ఒకటి ఆధారము, రెండవది ఆధేయము, ఈ టేబుల్ పైన ఈ టంబ్లరు వుంది. టేబుల్ ఆధారము. టంబ్లరు ఆధేయము. టేబుల్ లేకుండా టంబ్లరు పెట్టటానికి వీలులేదు. అన్నింటికి మూలాధార శక్తిని బ్రహ్మ అన్నారు. ఎనర్జీ అన్నారు. ఆత్మ అన్నారు. అది లేకుండా ఈ జగత్తు అనే పదార్థము వుండుటకు వీలుకాదు.

విద్యార్థులారా! జగత్తు యొక్క సృష్టికి ఏది ఆధారమని మీరు యోచించవచ్చును. మొట్టమొదట స్వప్నమునకు కారణమేదో మీరే విచారించండి. కొంతమంది thoughts దీనికి కారణమంటారు. కొంతమంది దీనికి ఆహారమే కారణము అంటారు. కానీ ఏదీ సత్యము కాదు. దీనికి కారణము నిద్రయే. నిద్రలేక స్వప్నమేరాదు. కనుక సృష్టికి ఏది కారణమంటే అజ్ఞానమే. ఇది ఎట్లు వస్తుండాది; ఎట్లు పోతుండాది. అప్పుడూ, యిప్పుడూ కూడ అవ్యక్తముగానే వుంటుండాది. ఎండాకాలము లోపల భూమంతా ఎండి చాలా చాలా డల్లుగా కనబడుతుంది. కానీ వర్షము కురిసిన తక్షణమే పచ్చగా అయి మొక్కలు మొలవటము ప్రారంభమవుతుంది. ఇవి పూర్వము ఎక్కడనుండి వచ్చాయి. ఇవి పూర్వము అవ్యక్తమైన విత్తన రూపములో వుండేవి. ఆ అవ్యక్తమైన మొక్కలే లేకపోతే ఈ వ్యక్తమైన మొక్కలు రావటానికి వీలుకాదు. ఈ విత్తనమే కర్మ. మనము ఎటువంటి action చేస్తుంటామో దానికి reaction resound తప్పినది కాదు. కనుకనే do good, be good, see good అని అన్నారు. మంచిగా చెయ్యండి. మంచిగా వుండండి. మనము పనులు చేస్తున్నప్పుడు ఫలితములను దృష్టిలో పెట్టుకోకుండ, త్యాగ దృష్టితో పనులు చేస్తుంటాము. కాని రిజల్టు వచ్చినప్పుడు మనము భయంకరముగా బాధపడతాము. నీవు భయపడినా లేక ఆనందించినా దాని ఫలితము తప్పినది కాదు. ఈ జలము లోపల చక్కెర వేసుకొని యిది విషము యిది విషము అని త్రాగినా అది మంచి చేస్తుంది. ఈ గ్లాసులో విషము వేసుకొని యిది చక్కెరపాకము, యిది చక్కెరపాకము అని త్రాగినా చంపేస్తుంది. మనము చెడ్డను మంచి మంచి అని అనుభవించినా అది చెడ్డ చేయక తప్పదు. మన భ్రాంతి కాదు. మన కర్మే దాని స్వరూపాన్ని నిరూపించాలి.

కనుక ప్రతి మానవునకు మొట్టమొదట ఆచరణ అత్యవసరము. ఈ ఆచరణలోనికి మనశ్శక్తిద్వారా మనము ప్రవేశించాలి. ఈ మనస్సు యింద్రియములతో కూడకుండ యేది చేసినా యిది దైవాజ్ఞ అనే భావముతో మనము మెలగాలి. ఎవరో నిన్ను తిడుతున్నారు. వాడెందుకు నన్ను తిడుతున్నాడు అని కోపము వస్తుంది. నా స్వామే, నా దైవమే నా దగ్గరకు వచ్చి నన్ను తిట్టి, నా దోషము పరిహారము చేస్తున్నాడు. అని అనుకో. ఎంత ఆనందముగా వుంటుంది. ఎవరో నిన్ను కుక్క, గాడిద అని తిడతాడు. ఎందుకు బాధపడాలి. కుక్క, గాడిద అని తిట్టినప్పుడు నీకు నాలుగు కాళ్లుగాని తోకగాని రాలేదు. లేని దానిని మనము ఎందుకు నెత్తిని వేసుకోవాలి. ఈ విధమైన సహనాన్ని మనము లేత హృదయమునుండి అభివృద్ధి చేసుకోవాలి. మనను ఎవరేమన్నను చలించకూడదు. భ్రమించకూడదు. నీ చలించటమూ, నీ భ్రమించటమూ, దైవ విశ్వాసము సన్నగిల్లినప్పుడే యివన్నీ జరుగుతాయి. తనపైన తనకు విశ్వాసము లేక, దైవముపైన విశ్వాసము లేనివాడే అనేక దుఃఖములకు, విచారములకు గురౌతాడు. కానీ యీనాటి మానవునకు అటువంటి శక్తి లేక పోయినప్పటికిని, అహంకారముతో విఱ్ఱవీగుతుంటాడు. వెర్రివాడై నేనే చేశాను, నేను చేశాను అని భ్రమిస్తున్నాడు నేను చేశాను అని భ్రమించినవాడు, దాని రిజల్టుకూడా తనకర్మఫలమే అని ఎందుకు

భావించ కూడదు. కర్మను ఆచరించే సమయములో మాత్రము నేను చేశాను అంటాడు. ఫలితము చెడ్డగా వస్తే యిది నాది కాదంటాడు. కనుక మంచిగాని, చెడ్డగాని భగవంతుని మీద బాధ్యత వేసి మన కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి ప్రయత్నించాలి.

పూవులెన్నొ తెచ్చి పూజలు చేసిన
మెచ్చబోడు తాను పుచ్చుకొనడు
హృదయ కమలమివ్వ సదయుడై గ్రహియించు
సత్యసాయి ప్రేమ శాంతిదాయి.

ఈ పుష్పములతో పరమాత్ముడు మెచ్చుకొనడు. మీ దగ్గర ఒక పుష్పం వుంటున్నది. అది వాడేదీ, కూలేదీ, రాలేదీ కాదు. అదే హృదయ కమలము. ఆ హృదయ కమలము జలములో వుంటున్నది. ఆ జలము ఏమిటి? అదే ప్రేమ జలము. హృదయ కమలము, ఆ ప్రేమ జలము లేకపోతే ఒక క్షణకాలమైనా బ్రతకదు. రాధ చెప్పింది. ఎంతో కాలము ప్రేమ అనే జలములో కృష్ణా అనే హృదయ కమలాన్ని కాపాడుకొంటూ వచ్చింది. కృష్ణా హృదయ కమలాన్ని కాపాడుకోటం కోసము కంటి ధారలను కాలువలుగా ప్రవహింప చేశాను. ఆ జలమూ కూడా ఎండిపోయింది. దానిని నే టిలో పెట్టుకొన్నాను. దానిని ప్రేమ అనే జలములో కాపాడుకొంటూ వచ్చాను. అది ఎండిపోయింది. నీవు యిచ్చిన దానిని నీకే అర్పితముగా ఇస్తాను.

ఏ హృదయంబు నొసంగితివో ఈశ నాకు
మగిడి దానినే యర్పింతు మహిత మూర్తి
పరగ వేరేమి తెత్తు నే అర్చనకును
అంజలి ఘటింతు అందుకోవయ్యా నీవు

ఈ గుండెను నేను తీసుకొని రాలేదు. నీవే పెట్టి పంపించావు. ఈ monkey mind ను నీవే యిచ్చి పంపించావు. ఇవన్నీ నీ ప్రసాదములే. ఈ అన్ని ప్రసాదములు నీకే అర్పిస్తున్నాను. ఈ పవిత్రమైన పరిపూర్ణమైన భావాన్ని మనము అర్థము చేసుకుంటే జీవితము పరమ శాంతముగా సుఖముగా, ఆనందముగా అభివృద్ధి గావటానికి అవకాశము వుంటుంది. భగవంతుని శక్తే యీ జగత్తు. భగవంతుడు ప్రత్యేకము కాదు. ఈ ప్రకృతిని పరమాత్మగా భావించి దానిని మనము చక్కగా, సద్వినియోగముగా మనము అనుభవించాలి.

విద్య. ఏది విద్య. కేవలము దేహము, యింద్రియములు, అంతఃకరణ యిత్యాది వాటిపై మనము భ్రమ పెట్టుకొనటము వలననే అజ్ఞానమనే విద్యను అభివృద్ధి గావించుకొంటున్నాము. అవి పనిముట్లేగాని అవి మనము కాదు. ఇది నా టవల్ అన్నప్పుడు ఆ టవల్ నేనౌతానా. టవల్ వేరు నేను వేరు. My body అంటే body నేను కాదు. Body నాకంటె వేరుగా వుంది. ఈనాటి విద్యార్థులు యిరకమైన సూత్రములను అభివృద్ధి చేసుకోవాలి. ఇహమును సుఖింపచేయు లౌకిక విద్య, పరమును సుఖింప బ్రహ్మ విద్య. ఈ లౌకిక విద్యలు మనకు అవసరమే. అయితే పారమార్థిక దృష్టితో, ప్రాకృతమైన జగత్తును అనుభవించాలి. ఇది యీనాటి విద్యయొక్క

అంతరార్థము. లౌకిక విద్యలు మనము వదలకూడదు. ప్రాకృతిక విద్యలన్నీ మనము ఆధ్యాత్మిక విద్యలో లయము గావించాలి. అప్పుడే యిది సార్థకమైన విద్యగా అభివృద్ధి పొందుతుంది. ప్రతి విద్యార్థి కూడా ఆదర్శవంతమైన మూర్తిగా రూపొందాలి.

విద్యార్థులారా! మీరు కేవలము గొర్రె పిల్లలో, మేకపిల్లలో కాదు. మీరంతా పులి పిల్లలు, సింహపు పిల్లలు. మీరందరూ దైవబిడ్డలని మీరు విశ్వసించాలి. అప్పుడే యీ పవిత్రత మీలో ప్రవేశిస్తుంది. నేను పిల్లవాడినని అనుకుంటే నీవు చిన్నవాడివని క్షమించకూడదు. లేత వయస్సునందే యీ దోషాలు చేస్తే, పెద్దవాడివైన తరువాత యింకా ఎన్ని దోషాలు చేస్తానో అనే విచారణ చేయాలి. మన దోషములు యెంత చిన్నవైనా వాటిని క్షమించకుండా శిక్షించటానికి పూనుకోవాలి. కానీ యీనాటి పిల్లల పరిస్థితి బలహీనతలో చేరిపోయింది. ఏ దోషములు చేసినా దానిని మీరు సమర్థించుకోటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సమర్థించు టంచే తనే మానవత్వము వ్యర్థమై పోతున్నది. సమర్థించరాదు. self realisation యెంత ప్రధానమో self punishment అంత ప్రధానము. మనము సామాన్య మానవునిగానైనా బ్రతకటానికి ప్రయత్నించాలి. కాని మనము సామాన్య మానవునిగా కూడా జీవించటానికి వెనుకంజవేస్తున్నాము. ఇలాంటి పరిస్థితులలో విద్య మనకుగాని, మన దేశమునకుగాని ఏ విధముగాను తోడ్పడదు. మన విద్య యొక్క విశిష్టతను మన ప్రవర్తనతో మనము నిరూపించాలి.

విద్యార్థులారా! ముఖ్యముగా మనము ఏమి చేస్తున్నాము, ఏమి చదువుతున్నాము, ఏ విధముగా పాటుపడుతున్నాము అనే ప్రశ్న మనము యే మాత్రము వేసుకోటం లేదు. కేవలం చదువైన తరువాత ఉద్యోగము చిక్కాలి. ఉద్యోగలక్ష్యముతో మనము చదువుతున్నాముగాని, చదువులక్ష్యముతో మనము చదవటం లేదు. ఉద్యోగమునకూ చదువుకు యే మాత్రము సంబంధము లేదు. విద్య విజ్ఞానము కొరకు, కృషి కూటి కోసం. కనుక లక్ష రూపాయలను బీరువాలో పెట్టుకొని ఆకలి తీర్చుమంటే అది ఆకలి తీర్చదు. అన్నమే ఆకలి తీరుస్తుంది. నిజమైన health నిజమైన wealth మన ఆనందమే. ఈ ఆనందము ఆధ్యాత్మికములో తప్ప అన్యమార్గములలో మనకు యే మాత్రము లభించదు.

ఆధ్యాత్మికమంటే ఏమిటి? ఆధ్యాత్మికముతో మనము ఆత్మవిశ్వాసమును పెంచుకోవాలి. దైవానికి మనము సర్వము అర్పితము గావించాలి. మీకు తెలుసు. కృష్ణ తులాభారము ఒక పెద్ద డ్రామా. ఈ కృష్ణ తులాభారమునకు కారణమేమిటి? సత్యభామకు కృష్ణుని తనవాడుగా చేసుకోవాలని వాంఛ. కృష్ణుడు యీమె అహంకారమును, స్వార్థమును రూపుమాపాలని నిశ్చయించుకున్నాడు. నారదుడు ప్రవేశించాడు 'అమ్మా నీవు కృష్ణుని పొందాలనుకుంటే అతన్ని నీవు ఎవరికైనా దానమిచ్చి అంత ధనమును యిచ్చి నీవు అతన్ని తీసుకోవచ్చు'ని చెప్పాడు. నారదా! తరువాత కృష్ణుడు నన్ను వదలి పోడు కదా! అని నారదుని నుండి వాగ్దానము తీసుకున్నది. ఆమెలో అంత స్వార్థము వుంది. అతన్ని తూచి అతన్ని నేను తెచ్చు

102108810

...లను అన్న అహంకారము కూడా వుంది. ఆపని చేసింది. త్రాసులో ఒకవైపున కృష్ణుని కూర్చోపెట్టింది. మరొక దానిలో తనకున్న నగలు, ధనకనకములు, వజ్ర వైఢూర్య మణిమాణిక్యములు పుష్యరాగములను వేసింది. శమంతక మణిని కూడా వేసింది. పాపం కృష్ణుడు అణుమాత్రమైనా కదలలేదు. దీని అంతరార్థమేమిటి? భగవంతుని ధనముతో కొనటానికి సాధ్యము కాదు. నా అహంకారముతో అతనిని పొందటానికి వీలుకాదు. వజ్రమాణిక్యమరకత గోమేధ పుష్యరాగములు అతనితో సమానము కావులనే సత్యాన్ని లోకానికి చాటుటమే కృష్ణుని తులాభారము యొక్క అంతరార్థము. అయితే దేనికతడు వశమవుతాడు? రుక్మిణి వచ్చింది. ఆమె నిరహంకారి. నిస్స్వార్థపరురాలు. సత్యభామ రుక్మిణి వద్దకు వచ్చినప్పుడు ఆమె తులసి పూజ చేసుకొంటున్నది. తులసి దళమును త్రుంచి, తన నోటిలో వేసుకోటం ఆమెకు అలవాటు. సత్యభామ తొందరను చూచి, ఆమె ఆదళమును నోటిలో వేసుకొనక చేతిలోనే పెట్టుకొని వచ్చి సత్యభామ నోరువిప్పి అంతా వివరించింది. 'అయ్యో అవివేకురాలా! మన కృష్ణుడు ధనముతో తూగుతాడా. నీ అహంకారముతో తూగుతాడా. చాలా పొరబడుతున్నావు. తులసి దళమును చేతిలో పట్టుకొన్నది. పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో భక్తి కలిగిన వారికి వశుడవగుట సత్యమైన నీవు ఈ తులసిదళమునకు తూగుదువుగాక! తులసిదళమును తీసి హే! కృష్ణా అని తులసి దళము వేసింది. కృష్ణ రూపమునకు కృష్ణనామమే సరియైన తూకము. కృష్ణా అని తులసి దళమును వేయటం వలన కృష్ణనామము కృష్ణరూపమును తూచింది. తులసి దళము extra weight అయిపోయింది. పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో అంటావేమిటి! మనము పూజ చేస్తున్నప్పుడు పత్రమన్నప్పుడు మారేడు పత్రమో, జాజి పత్రమో తీసుకొని వేస్తున్నాము. పుష్పమన్నప్పుడు మల్లెపువ్వో, సంపెంగ పువ్వో వేస్తున్నాము. ఫలమన్నప్పుడు అరటి పండో, ఆపిల్ పండో పెట్టి కొంచెము గిల్లి అర్పించి చివరకు తానే తింటున్నాడు. తోయ మంటూ జలము, నూతిలోనుండిగాని, tap నుండిగాని తీసి అర్పిస్తున్నాడు. ఇది కాదు రుక్మిణీదేవి భావము. పత్రమనగా దేహపత్రము. దీనినే నీకు అర్పిస్తున్నాను. పుష్పమనగా హృదయ పుష్పము - నా హృదయ పుష్పమును నీకు అర్పిస్తున్నాను. ఫలమనగా మనోఫలము. తోయమనగా ఆనందబాష్పములు. నీవు ఇచ్చినది నీకే ఇస్తున్నాను. ఈ హృదయ పుష్పాన్ని నేను తీసుకొని రాలేదు. ఈ దేహమనే పత్రాన్ని నేను తీసుకొని రాలేదు. ప్రతి ఒక్కటి నీ gift. అది నీకు ఇస్తున్నాను. ఈ విధమైన పవిత్రమైన భావములతో రుక్మిణి సర్వస్వమూ సాధిస్తూ వచ్చింది. పరమాత్మని వశము చేసుకోటానికి ప్రేమతత్వము ఒక్కటే అని పరమ భక్తులు లోకానికి చాటుతూ వచ్చారు. పరమాత్మని పొందటానికి ప్రేమ ప్రధానము. అన్నీ అక్కడనుండే వచ్చాయి. అన్నీ అక్కడికే చేరిపోవాలి. మనము బ్రహ్మనుండి వచ్చిన వారము. మనము బ్రహ్మ భావముతోనే వుండాలి. బ్రహ్మ తలంపులే రావాలి. అనగా పవిత్రమైన తలంపులే వుండాలి. పవిత్రమైన చర్యలు వుండాలి. పవిత్రమైన దృష్టి వుండాలి. ఏకత్వము అభివృద్ధి గావించుకోవాలి.

వీటినన్నింటిని జయదేవుడు చక్కగా బోధించాడు.

1021088 11

జిహ్వే రసజ్ఞే మధురప్రియత్వం సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవరణమేకా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.

నాలుకా! రసమెరిగిన నాలుకా! మధురమైన నాలుకా! త్యాగమైన నాలుకా, సహనమైన నాలుకా నీకు యేమి శోభించాలి. నీ సహనము, నీవు చేసిన త్యాగము, నీ ఔదార్యము, నీ గౌరవము నీకే సాటిగాని అన్యులకు సాటిగాదు. నాలుకా! నీవు చాలా శాంతపరురాలవు. నీవు చాలా మెత్తని దానివు. కత్తులవంటి ముప్పదిరెండు దంతముల మధ్యమందున్నప్పటికి నీవు యెంత జాగ్రత్తగా నడుస్తున్నావు. ఈ ప్రపంచములో నేను వుంటున్నాను. నేను అందరితోనూ భయపడుతున్నాను. ఇంత రాక్షసుల మధ్య వుండి కూడా నీవు ఎంత శాంతముగా, ఎంత జాగ్రత్తగా మెలగుతున్నావు. నీ జాగ్రత్త మానవులకే వుండి వుంటే ఎంత తరించి వుండే వారు. నీ త్యాగము చూస్తామా ఏదైనా మధురమైన పదార్థములు నీకు పెట్టినప్పుడు యిది మధురముగా వున్నది జఠరాగ్ని నీవు తీసుకో అని క్రిందకు పంపిస్తుంది. ఏదైనా చేదుగా వుంటే అప్పుడు ఛీ! ఛీ! యిలాంటి దానిని నీవు తీసుకో నీవే పుట్టించావని భూదేవికి యిచ్చేస్తుంది. ఇంకా యిది తన గౌరవమును యేవిధముగా కాపాడుకొంటుంది. తన స్థానములో తన యింటిలో మాత్రమే దాగుండి తన కర్తవ్యకర్మలన్నీ చక్కగా ఆచరిస్తుంది. ఈగది నుండి ఆగదికి, ఆగది నుండి యీగదికి పిల్లివలె ప్రయాణము చేయదు. ఈనాటి పిల్లలు, పిల్లులవలె, ఎలుకలవలె బయటకు రాదు. నేను గంటసేపు మాట్లాడినా నా నాలుక బయటకు రాదు. అది చాలా గౌరవముగా బ్రతుకుతుంది. ఇది చెడ్డపనిని చేసినవానిని నిందిస్తుంది. మంచిపనిని మంచిపనిని చేసినవానిని వర్ణిస్తుంది. మంచివానిని చూచి నీవు దేవుడంతటి వాడవయ్యా అని వర్ణిస్తుంది. వారు చేసిన చెడ్డపనులు చూసి పశువా అని నిందిస్తుంది. ఎంతో న్యాయంతో వుంటుంది. అందువలనే జయదేవుడు హితము చెప్పాడు. ఏమిటా హితము. గోవిందా, దామోదరా, మాధవేతి. కానీ యీనాడు మన నాలుకను వారిని, వీరిని నిందించటానికి వుపయోగిస్తున్నాము. వారిని వీరిని హేళన చేయటంతోనూ మనము ప్రవేశపెడుతున్నాము. మన కన్నులు చూస్తామా అంటే కాకి మేలు. చెడ్డను చూడటానికి మన కన్నులను concentrate చేస్తుంటాము, మంచిని చూడటానికి వాటిని వుపయోగించము. కాలేజికి సైకిల్ మీద పోతూ తన దారిలో ఏమి వస్తున్నదో చూడడు. గోడ మీదనున్న వాల్ పోస్టర్లు చూస్తుంటాడు. ఇంతలో ఒక రిక్షా యితన్ని కొట్టేస్తుంది. అక్కడికి నీ దృష్టి ఎందుకు పోవాలి? నీవు రోడ్డును చూచుకొని పో. నీ దృష్టిని దుర్వినియోగము చేస్తున్నావు. దీనికి కాకి దృష్టి అని పేరు. కాకి అయినా మేలు. దీనికి సుఖము వచ్చినా దుఃఖము వచ్చినా కావు కావు మని అరుస్తుంది. కావు అంటే ఓ భగవంతుడా కావుమని అంటుంది. మనిషి అదికూడా చెప్పడు. కాకి వచ్చి గోడ మీద వాలుతుంది. ఒక్క క్షణము కూడా దాని దృష్టి స్థిరముగా వుండదు. మన చూపులు కూడా యిలాగే వుంటుంటాయి. మనము యితరుల సుఖాలు, యితరుల వేషాలు చూస్తుంటాముగాని మన కర్తవ్యమేమిటో మనము గుర్తు

102108812

...న్న విశాల భావము మనకు రాదు. మీరందరు క్రొత్తవారుగా వుంటున్నారు కనుక యీ విషయములను మీకు తెలుపవలసి వస్తున్నది. చెవులను సృష్టించే సమయములో దానికి మూతలు పెట్టలేదు. ముక్కుకు కూడా మూతలు పెట్టలేదు. ఒక్క కన్నులకు నోటికి మాత్రమే మూతలు పెట్టారు. కారణమేమిటి? ఆ రెండు జాగ్రత్త అయినవి. Bad look వచ్చిందంటే కన్నులను మూసుకో. కోపమో రౌద్రమో వచ్చినప్పుడు నీ నోటిని మూసి పెట్టు. Bad talk మనిషిని bad man గా మారుస్తుంది. ఈ రెండూ లేకుండా చూచుకోండి. ఈ రెండూ మానవుని ఉన్నతస్థానమునకు గొనిపోయే రెండు చక్రముల వంటివి. రెండు రెక్కల వంటివి. ఈ రెండూ లేకున్న మానవునిలో యే దోషములు వుండటానికి వీలు లేదు. భగవంతుని తత్త్వము ఎల్లప్పుడూ పవిత్రముగా వుంటుంది.

కప్పురంబు తెలుపు
కామధేనువు తెలుపు
చుక్క తెలుపు హంసరెక్క తెలుపు
అందమైన సాయి మందహాసము తెలుపు.

కనుక మీరందరు మందహాసముతో జీవించాలి. మీ హృదయములు ఆనందముతో నిండుకోవాలి. ఇక్కడ మీకు యేమి తక్కువగా వుందని. నయాపైస ఖర్చు పెట్టకుండా, కాలు కదపకుండా కైవల్యము వడిలో పడుతున్నది. ఇలాంటి సమయములోపల ఎందుకు మీరు castor oil face వేసుకోవాలి. castor oil త్రాగిన వారిలా వుంటుంటారు. కర్తవ్యము చేయని వారికే castor oil face. కొంతమంది examination అంటే భయపడతారు. examination తప్పక వుండాలి. నీ చదువు బాగా చదివివుంటే examination గురించి భయపడనక్కరలేదు. examinations ఎప్పుడెప్పుడు వస్తూవుంటాయని ఎదురు చూస్తుండాలి. examination ఎంత త్వరగా వస్తే అంత త్వరగా మనము పాస్ అయిపోతాము. కానీ పిల్లలు సరైన అర్థము గుర్తించుకోటంలేదు. examinations వచ్చేకొలది ఆనందమును అభివృద్ధి పరచుకోవాలి. మనము late చేసేకొలది మన time waste అయిపోతుంది. కనుక మనము examinations వచ్చేకొలది ఆనందముతో వుండాలి. చెట్లలోపల పుష్పము వుంటుంటాయి. ఆదశలో వాటి విచ్చేసరికి సుగంధము గట్టిగా వస్తుంది. అది రాలిపోయే ముందు చక్కగా వికసించి పరిపూర్ణమైన పుష్పంగా క్రిందపడిపోతుంది. ఈ పరీక్షలు వచ్చేకొలది మన ముఖములు విచ్చినట్లుగా వుండాలి. అట్లుకాకుండా stomach ache, head ache అని ఈ aches లో వుండకూడదు.

Happiness is union with God. అనేక మంది పిల్లలు మేము fail అయిపోతామన్న మాటకు యేమాత్రము అవకాశము యివ్వరాదు. నీ కర్తవ్యమును నీవు చక్కగా నిర్వర్తించు. నీవు pass అవుతావు. నీవు fail అయినప్పుడు ఆ మాష్టరుది తప్పు, యితనిది తప్పు అని వారిపై తప్పు వేస్తున్నావు. ఇది నాదే తప్పు. అని తనకు తానే ప్రశ్నించుకోవాలి.

నీవు చక్కగా చదివితే ఎందుకు పాస్ అవలేదు. నీ కర్తవ్యాన్ని నీవు చక్కగా నిర్వర్తించు. విద్యార్థిగా వున్నప్పుడు విద్యార్థి ధర్మాన్ని చక్కగా నిర్వర్తించు. గృహస్థుగా వున్నప్పుడు గృహస్థ ధర్మాన్ని చక్కగా నిర్వర్తించు. కనుక మనము యేస్థానములో వుంటామో దానికి తగినట్లుగా మనము ప్రవర్తించాలి. అన్నింటికిని భగవంతుని ఆధారము తీసుకోవాలి. అది లేనివానిని కాకులు కూడా ముట్టవు. కనుక మనము మంచి భావములను అభివృద్ధి పరచుకోవాలి. ప్రతి ఒక్కటి జరిగినా మనలో తాను compare చేసుకోవాలి. పిల్లలో యిది చాలా అవసరము. మనము ఎవరినైనా బాధపెడితే, యీ బాధ మనకు యితరులు పెడితే యెంత కష్టముగా వుంటుంది అని మనము ఆలోచించాలి. దీనినే భూజాతయైన సీత రావణునకు బోధించింది. రావణుడు వచ్చి సీతను చంద్రుని విమర్శించాడు. 'నేను చాలా అందముగా వున్నాను. గొప్పరాజును. వైకుంఠమునకు మించిన సౌకర్యములు సమకూరుస్తాను. నన్ను వరించు' అని ఆదేశించాడు. అప్పుడు సీత చెప్పింది 'రావణా! నీపత్ని మండోదరిని మరొక పురుషుడు అపహరిస్తే నీవు ఏవిధంగా వుంటావు? నీవు నన్ను అపహరించటం చేత నా పతి వియోగములో బాధపడుతున్నాను. నిన్ను నీవు వుదాహరణగా తీసుకో. నీ భార్యను ఎవరైనా తీసుకొనిపోతే నీవు శాంతముగా వుంటావా? మనము యితరులపై చెడు దృష్టి వుంచినప్పుడు మనవారిపై యితరుల చెడ్డ దృష్టి పడుతుంది. మనవారిపై, మన కుటుంబము పై చెడ్డ దృష్టి పడినప్పుడు నేను వూరుకుంటానా అది తప్పు అని సరిదిద్దుకోవాలి. ఇలాంటి examples లోపల మనవిద్యార్థులు చక్కగా అభివృద్ధి కావాలి.

ఈనాడు మనకు కావలసినది good behaviour, good manners good discipline. యివన్నీ వున్నప్పుడే సరైన good life వస్తుంది. కానీ యీనాడు మనము వీని విశ్వసించకుండా వున్నాము. manners కలిగినవాడే man. manners అంటే ఏమిటి మన thoughts, words, actions ఏకము కావాలి. The proper study of mankind is man. మొట్టమొదట పద్యమునందు చెప్పాను 'మనసునందు మంచి మాటనందున మంచి, నడతనందున మంచి' ఇవే మన జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుతాయి. మాటలందున తీపి, మనసునందు చేదుంచ మంచిది కాదిది. ఈనాడు మనవారి words స్వీట్ గా వుంటాయి. కాని mind చూస్తే bitter గా వుంటుంది. mind ను స్వీట్ చేసుకోవాలి. అప్పుడే నీ దృష్టి sweet, శ్రవణము sweet, హృదయం sweet అన్నీ స్వీట్ గానే రూపొందుతాయి. మనము యీ టంబ్లరులో నీరు పోసి దానికి యేచోట రంధ్రము పెట్టినా ఆ రంధ్రమునుండి నీళ్ళే వస్తుంది. నా హృదయమనే పాత్రలోపల భగవత్ ప్రేమ అనే దానిని నింపుకో. నీ actions నీ looks నీ words అన్నీ తీయగానే వస్తాయి.

కనుక విద్యార్థులు విద్యతో బాటు భగవత్ప్రేమ తత్వాన్ని, విశాల హృదయాన్ని, స్వార్థము, అహంకారము, ఆడంబరములనే వానిని అణగద్రొక్కి ఆదర్శప్రాయులుగా జీవించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.